
జిందగీ
# చింతన
నమస్తే తెలంగాణ హైదరాబాద్
సోమవారం 19 ఆగస్టు 2024
www.ntnews.com




**శుక ఉవాచ.. పరీక్షిన్మహారాజా! గోకులంలో నందాది వృద్ధ గోపకులు ఇంద్ర యాగానికి సిద్ధపడటం చూచి సర్వజ్ఞుడైన శౌరి వారిని ఇలా ప్రశ్నించి వారించాడు- 'నాన్నగారూ! మీరీ జన్నాన్ని (యాగాన్ని) పరిపాటిగా- పరంపరగా వస్తున్న ఆచారంగా భావించి చేస్తున్నారా లేక యాగ రహస్యం తెలిసి ఆచరిస్తున్నారా? దీనికి, 'పుత్రకామేష్టి' వలన పుత్రప్రాప్తి వలె దృష్ట- ఐహిక ఫలమా లేక జ్యోతిష్టోమానికి స్వర్గప్రాప్తి వలె అదృష్ట ఆముష్మిక- లోకాంతర ఫలమా? శాస్త్రవిధి విధానం తెలిసి చేస్తేనే కర్మలు ఫలిస్తాయి. తెలియక చేస్తే ఫలించవు కదా! మీ ఉద్దేశం నాకు చెప్పండి'. 'ఇంత చిన్నవాని మాటలు ఎంతలేసి పెద్దవో' అంటూ చెంతనున్న వారంతా ఒకింత వింతగా చూచారు.**

# ఇంద్రయాగం నందవ్రజం ఆగమాగం


మన పోతన 181 వ భాగం మధురిమ

**రాజా!** గడుసరి కొడుకు గోవిందునికి తండ్రి నందుడు ముక్తసరిగా ఇలా సమాధాన మిచ్చాడు.. 'కుమారా! ఇది పరంపరగా వస్తున్న ఆచారమే. ఇంద్ర యాగం చేస్తే దేవేంద్రుడు సంతసించి నిరంతర వర్షధారలు కురిపిస్తాడు. అంత పాడిపంటలు మరింతగా పెరుగుతాయి. మన జీవితాలు సుఖవంతాలవుతాయి'. జనకుని పలుకులు విని జనార్దనుడు బాల ముకుందుడు సునాసీరు- ఇంద్రునికి కినుక చాల హెచ్చునట్లు నందునితో ఇలా అన్నాడు.. తండ్రీ! కర్మ చేతనే ప్రాణి వర్గానికి జన్మ, వృద్ధి, క్షయాలు. కర్మలే జీవుల సుఖదుఃఖాలకు కారణం. కర్తకు వాని కర్మలే తగిన ఫలాలను ప్రసాదిస్తూండగా మధ్యలో ఈశ్వరుని- ఇంద్రుని ప్రసక్తి ఎందుకు? ఆ ఈశ్వరుడు కూడా కర్మ చేసిన వానికే ఫలమిస్తాడు కాని, ఏ కర్మా చేయని వానికి ఏమీ ఇవ్వడు కదా! కర్మఫలాలను ఏ ధర్మదేవతా తప్పించలేదుగా! జీవునికి కర్మమే దైవతం. 'తస్మై నమః కర్మణే'- అతడు కర్మనే దైవంగా భావించి సంభావించాలి- ఆరాధించాలి. కర్మల, ఆయా ఫలాల మర్మ- రహస్యమిలా ఉండగా నడుమ బిడౌజుని- అమరేంద్రుని ప్రమేయం ఏముంది? కనుక, అతనికి కినుక పూనవలసిన పని లేనేలేదు. ఒకవేళ కోపగించినా మనకొచ్చే ఆపద ఏమీలేదు. కాన, పితాశ్రీ! మన హితానికి- సుఖజీవితానికి హేతువులైన మన గోజాతిని పోషించే గోవర్ధన పర్వతాన్ని పూజిద్దాం. పతితులకు, అనాథలకు అన్న సంతర్పణం చేద్దాం. గిరి, గోవులను పరిక్రమిద్దాం- ప్రదక్షిణలు గావిద్దాం'. నిలింపపతి ఇంద్రుని సొంపు- సంపద సమృద్ధి మదం, దింపు- తొలగించే, తలంపుతోనే పరమాత్మ ఇలా పలికాడు. నందాదులంతా ఆనందంగా అంగీకరించారు.

**మ|| 'సకలాభీరులు వీడె కృష్ణుడన నైజంబైన రూపంబు తో**
**నకలంక స్థితి నుంచి శైలమిదె మీ రర్చింప రండంచు దా**
**నొక శైలాకృతి దాల్చి గోపకులతో నొండొండ పూజించి గో**
**పక దత్తాన్నము లాహరించె విభుడా ప్రత్యక్ష శైలాకృతిన్'-**

శుకముని.. రాజా! లీలా పురుషోత్తముడు బాల గోపాలుడు, గోపకులందరూ 'ఇడుగో కృష్ణుడు' అనుకొను రీతిగా గొల్లల మధ్య నిర్మలాకృతితో నిశ్శంకగా నిలబడి వారితో- 'ఇదిగో పర్వతం. దీనిని పూజించడానికి మీరందరూ పూనికతో రండి' అంటూ తాను తత్క్షణం పర్వతాకారం ధరించాడు. ఆ ఆభీరుల- గొల్లలతోనే కలసి గిరి రూపం దాల్చిన హరి తన్నుతానే వరివస్య- పూజ చేసుకొంటూ వారు అర్పించిన నైవేద్యాలన్నిటిని వేదవేద్యుడు పరామోదంతో ఆహరించాడు- ఆరగించాడు. వందారు మందారుడైన (కైమోడ్పు వారికి కల్పవృక్షమైన) అరవిందాక్షుడు నందనందనుడు ఇలా ఈ గోవర్ధన లీలలో 'పూజ్య- పూజక- పూజలు' (పూజింపబడువాడు, పూజించేవాడు, పూజా కార్యక్రమం) ఈ త్రిపుటి తానే అయ్యాడు. గోపకులు శ్రీహరితో కూడి గిరికి పూజలు, కానుకలూ సమర్పించి, ఆనంద లహరిలో ఓలలాడుతూ ఆలమందలతో దానికి పరిక్రమ చేశారు. అనంతరం మాధవునితో కలసి మందకు మరలిపోయారు.

అప్పుడు జరిగినదంతా తెలుసుకొని జంభాసుర వైరి- ఇంద్రుడు సంరంభం (కోపం, ఆటోపం)తో దంభోళి (వజ్రాయుధం) జళిపించి...

**క|| 'గురుదేవ హీను బాలుని**
**గిరి భూజ ప్రముఖ వాసు గృష్ణు ననీశుం**
**బరిణామ శీలు గుల గుణ**
**విరహితు జేపట్టి యింద్రు విడిచిరి గొల్లల్'...**

'ఈ కృష్ణుడు గురువు దైవము లేనివాడు, బాలుడు, కొండల్లో కోనల్లో ఉండేవాడు. ఎవ్వరి మీద ఎలాంటి విభుత్వం- ఆధిపత్యం లేనివాడు, చంచల స్వభావుడు, కుల రహితుడు, గుణహీనుడు ఐన ఈ కుర్రని మాటలు విని విర్రవీగి ఈ గొల్లలు వేలుపు దొరనైన నన్ను త్యాగం చేశారు. నా యాగాన్ని విడిచారు. ఇక వీరి ఆటలు సాగనివ్వను.' అని ఉగ్రుడై.. ఉరుములు, మెరుపులతో రాళ్లవాన కురిపించి, నంద గోకులాన్ని ఆగమాగం చెయ్యండని ప్రళయ భయంకరమైన సంవర్తక మేఘ బృందాలను ఆదేశించాడు. అవి మందను ఆవరించాయి. దట్టంగా కారుచీకట్లు కమ్మించాయి. విరామమెరుగని వడగండ్ల వానతో పిడుగులు రువ్వాయి. గోపయ్యలు కొయ్యబారి పోయారు. ఎటు చూచినా ఆవుల లేగల అంబారావాలు, ఆర్తనాదాలు. ఆ జడివానకు తాళలేక బడుగు (సన్నని) నడుముల గోపికలు గడగడ వణుకుతూ గోవిందునికి మొర పెట్టుకున్నారు.

అందమైన పై కందపద్యంలో దేవేంద్రుడు ఉపేంద్రుని- కృష్ణుని నిందిస్తున్నట్లు పైపైన అనిపిస్తున్నా నిజానికి విచారిస్తే అవి స్తుతివాక్యాలుగానే గోచరిస్తాయి. పరబ్రహ్మము (నిర్దోషం హి సమం బ్రహ్మ- గీత) దోషరహితం కాన ఆయన యందు నింద పొసగదు- వర్తించదు. ఎలాగన.. గురుదేవహీనుడు- 'కృష్ణంవందే జగద్గురుమ్'- తానే జగత్తుకు గురువైతే తనకు మరో గురువు ఉంటాడా? తానే ఆదిదేవుడు, మహాదేవుడు, దేవాధిదేవుడు. తనకు మరో దేవుడు లేడు. బాలుడు- 'బాలు భంగి నితడు భాసిల్లుగాని సర్వాత్ముడాది విష్ణువగుట నిజము'- బాలుని వలె కనిపించుటే కాని ఇతడు సర్వాత్ముడైన ఆ శ్రీహరియే!- అంటుంది యశోద విశ్వరూప సందర్శనంలో. గిరి భూజ ప్రముఖవాసుడు- చరాచరాలందు అంతటా వ్యాపించి ఉన్నవాడు, అనీశుడు- సర్వేశ్వరుడు కాన తనకు మరో ఈశుడు- అధిపతి లేనివాడు, పరిణామశీలు- ధర్మరక్షణకై పలు రూపాలలో పరిణమించు- అవతరించువాడు. పరబ్రహ్మ ఎలా అగుపించినా పరబ్రహ్మే! కులహీనుడు- కులమనగా శరీరమని కూడా అర్థం. జీవుని వలె పాంచభౌతిక, పార్థివ- మృణ్మయ దేహం లేనివాడు. గుణహీనుడు- సత్త్వరజస్తమో గుణాలు లేని గుణాతీతుడు! ఇలా నింద రూపంలో ఉన్న స్తుతికి 'వ్యాజస్తుతి' అనిపేరు. ఇది బమ్మెర వారి స్వీయ రచన!

**క|| 'వారి బరువయ్యె మందల**
**వారికి, నిదె పరులు లేరు వారింపంగా**
**వారిద పటల భయంబును**
**వారిరుహ దళాక్ష! నేడు వారింపగదే!'**

'వారిజనేత్రా (పద్మాక్షా)! మందలోని వారినందరినీ ఈ ఉపలవృష్టి- రాళ్లవాన కొందల (క్షోభ, కలత) పెడుతోంది. ఈ ఉపద్రవాన్ని నివారింపగలవారు నీవు తప్ప మరెవరున్నారు? దయావారిధీ! ఈ సంవర్తక వారిదా (మేఘా)ల భయాన్ని వారించి కాపాడు'. శుకుడు.. రాజా! ఆపన్నులైన గోకులవాసుల విన్నపాన్ని కన్నయ్య విన్నాడు. ఉన్నతమైన అమరాధిపత్యం అబ్బిందని కన్నుకానని అహంకారంతో అమరేంద్రుడు- (పెరుగులు, నేతులు తాగి క్రొవ్విన- బలసి గర్విస్తున్న ఈ గొల్లలు తన్ను తృణీకరిస్తున్నారని) మిన్ను నుంచి ఇలా శిలా వర్షం కురిపిస్తున్నాడని సర్వజ్ఞుడు హరి గ్రహించాడు. ఇంద్రునికి గర్వభంగం కావించాలని, నందుని మందలో కుందుతున్న- విలవిల్లాడుతున్న వారి నందరినీ వారి వారి ఆలమందలతో సహా ఒక చోట చేరమన్నాడు బాలకృష్ణుడు.

**క|| 'కిరియై ధర యెత్తిన హరి**
**కరి సరసిజ ముకుల మెత్తుగతి ద్రిభువన శం**
**కరకరుడై గోవర్ధన**
**గిరి యెత్తెం జక్క నొక్క కేలన్ లీలన్'...**

అలా పలికి, కిరి- ఆది వరాహమూర్తియై ఇలను- భూమిని ఉద్ధరించిన హరి, ముల్లోకాలకు శంకరుడై- మోదం కలిగించడానికి, కరి- ఏనుగు గున్న తామర మొగ్గను పైకెత్తు రీతిగా గోవర్ధన గిరిని ఒక్కచేతితో అవలీలగా ఎత్తి పట్టుకున్నాడు.

**శా|| 'బాలుండాడుచు నాతపత్రమని సంభావించి పూగుత్తి కెం**
**గేలం దాల్చిన లీల లేనగవుతో గృష్ణుండు దానమ్మహా**
**శైలంబున్ వలకేల దాల్చి విపుల ఛత్రంబుగా బట్టె నా**
**భీలాభ్రచ్యుత దుశ్శిలా చకిత గోపీ గోప గోపంక్తికన్'**

శుకుడు- రాజా! పసివాడు ఆటలాడుతూ ఒక పూలగుత్తిని గొడుగుగా భావించి తన సుతిమెత్తని చేతిలో ధరించిన రీతిగా, ఇలా గోవర్ధన శైలాన్ని బాలకృష్ణుడు లీలా దరహాసం చిందిస్తూ తన వలకేల- కుడిచేత ధారణ చేశాడు. దారుణమైన వారిద- మేఘాల శిలా వర్షానికి పిల్లపాపలతో ఆపసోపాలు- అవస్థలు పడుతున్న గోప గోపీ గోగణానికి అండగా ఆ కొండను పెద్ద గొడుగుగా పట్టుకున్నాడు. మూలంలో 'ఛత్రాకమివ బాలకః'- (చిన్న పిల్లవాడు పుట్టగొడుగును పట్టుకొన్నట్లు) అని మాత్రమే ఉన్నదానికి సహజ పాండిత్యుడు పోతన్న చేసిన సరస శ్రావ్యమైన పెంపుదల పై కంద, శార్దూల పద్యాలు.

**క|| 'దండిని బ్రహ్మాండంబులు**
**చెండుల క్రియ బట్టి యెగుర జిమ్మెడు హరికిన్**
**గొండ బెకలించి యెత్తుట**
**కొండొక పనిగాక యొక్క కొండా తలపన్'**

రాజా! బ్రహ్మాండాలను సైతం చెండు- బంతులవలె ఎగరేసే గండర గండడు- శూరుల కెల్ల శూరుడు, గోవిందుడికి ఒక కొండను పెళ్లగించి పైకెత్తడం చిల్లర- చిన్న పనిగాక ఎల్లరిచే ఎన్నదగిన ఘనకార్యమా?




తంగిరాల రాజేంద్రప్రసాద శర్మ
98668 36006

(సశేషం)

# పుత్తడి కాదు ఇత్తడి

ఇస్లాం బోధ



**ఒకానొక** వ్యాపారి దగ్గరికి ఒక వ్యక్తి వచ్చి 'నాకు డబ్బు అవసరముంది. ఈ బంగారు నగ ఉంచుకొని కొంత డబ్బు ఇవ్వండి. నెలరోజుల్లో డబ్బు చెల్లించి నగను తీసుకువెళ్తాను' అన్నాడు. వ్యాపారి డబ్బు ఇవ్వడానికి తటపటాయించాడు. అతను ఎంతగానో ప్రాధేయపడటంతో డబ్బు ఇవ్వడానికి అంగీకరించాడు. అయితే ఏడాది గడిచినా నగ తాకట్టు పెట్టిన వ్యక్తి తిరిగి రాలేదు. లాభం లేదనుకొని ఆ నగను తీసుకొని పట్టణానికి వెళ్లాడు వ్యాపారి. బంగారం దుకాణానికి వెళ్లి నగను అమ్మజూశాడు. కానీ, దుకాణ యజమాని దానిని పరీక్షించి.. 'ఇది పుత్తడి కాదు.. ఇత్తడి' అనడంతో వ్యాపారి కంగుతిన్నాడు. చేసేది లేక నిరాశతో ఇంటిముఖం పట్టాడు. ఏడాదిపాటు తన బంగారు నగలతోపాటు దాచి ఉంచిన ఆ గిల్టు నగను పాత సామాన్ల పెట్టెలో పడేశాడు వ్యాపారి.

మన స్థానాన్ని మనమే నిర్ణయించుకుంటాం. మనం పుత్తడి మనుషులమో, ఇత్తడి మనుషులమో మన ప్రవర్తనే నిర్ణయిస్తుంది. 'మాటమీద నిలబడేవారు పుత్తడి లాంటి మనుషులు. మాట తప్పేవారు ఇత్తడి మనుషుల'ని ఉలేమాలు పైకథను చెబుతుంటారు. మాట ఇచ్చి నిలుపుకోకపోవడం, చేసిన అప్పు తీర్చకుండా ఎగ్గొట్టడం అల్లాహ్ శాపానికి కారణాలు అవుతాయని ముహమ్మద్ ప్రవక్త (స) హెచ్చరించారు. ఇలాంటివారికి పరలోకంలోనే కాదు, లౌకిక జీవితంలోనూ ఎలాంటి విలువా ఉండదు. మాటకు కట్టుబడే వ్యక్తులంటే అల్లాహ్‌కు ఎంతో ఇష్టమని ఖురాన్ పేర్కొన్నది. 'మాట ఇచ్చి, తరువాత బొంకేవాడు ధర్మం లేనివాడ'ని ప్రవక్త తరచూ చెప్పేవారు. స్వర్గప్రవేశం చేసేవారిలో వాగ్దానానికి కట్టుబడేవారే ఉంటార'ని ఖురాన్ పేర్కొంటున్నది. ఇద్దరు వ్యక్తుల మధ్య ఏదైనా ఒప్పందం జరిగినప్పుడు దానిని తప్పకుండా నెరవేర్చాలన్నది ప్రవక్త బోధన.

... ముహమ్మద్ ముజాహిద్,
96406 22076

# ఎందుకు భయం?

**ఇహలోకంలో** తమ మనుగడను సుఖమయం చేసుకోవాలన్నదే చాలామంది జీవితాశయంగా ఉంటుంది. కానీ, కోరుకోకుండానే మనిషికి కష్టాలు ఎదురవుతుంటాయి. ఈ కష్టాలు మనిషి మనసు పరివర్తనకో, మనుగడ మార్పునకో దారితీస్తాయి. సామాన్య జనుల మధ్య సాగిన క్రీస్తు జీవనం సుఖమయంగా కాకపోయినా, ఎంత హృదయానందంగా గడిచిందో తెలిసిందే! కానీ, మనిషి కోసం మనిషి కష్టపడాలి. త్యాగం చేయాలి అనే సందేశం ఇవ్వడానికి కష్టాలకే చివరిస్థాయి అయిన మరణాన్ని అనుభవించాడు ప్రభువు. ఎన్నో అద్భుతాలు ఆవిష్కరించిన ఆయన, మరణాన్ని కావాలనే ఆహ్వానించుకున్నాడు. కష్టం అంటేనే క్రీస్తు అని నిర్వచనంగా మిగిలాడు. చిన్నపాటి కష్టానికే ఎందుకిలా భయపడతారు అని హెచ్చరికలు చేస్తూ ప్రభువు ధైర్యం ఇస్తుంటాడు. లేనిపోని కోరికలతో కష్టాలను కొనితెచ్చుకునే వారు ఎందరో! ఇతరుల సౌఖ్యం కోసం, క్రీస్తుపై ప్రేమాతిశయం వల్ల తమ జీవితాల్లో హింసల్ని ఆహ్వానించుకున్న క్రైస్తవ మహర్షులు ఎందరో ఉన్నారు. అలాంటివారిలో స్టీఫెన్ మహర్షి, పునీత సెసీలియా, మరియా గొరెట్టీ తదితరులు కనిపిస్తారు. చిన్నపాటి కష్టాలకే ఉలిక్కిపడే వారికి, వీరంతా ఒక మహా సందేశంలా నిలిచిపోతారు.

... ప్రొ||బెర్నార్డ్ రాజు,
98667 55024


క్రీస్తు సందేశం

# అనుబంధాలకు ప్రతీక

**అన్నాచెల్లెళ్లు,** అక్కాతమ్ముళ్ల అనుబంధానికి ప్రతీకగా జరుపుకొనే పండుగ రక్షాబంధన్. శ్రావణ పౌర్ణమి నాడు జరుపుకొనే ఈ పండుగ వెనుక ఎన్నో విశేషాలు ఉన్నాయి. పురాణాల ప్రకారం.. ఒకసారి దేవతలకు, రాక్షసులకు యుద్ధం జరుగుతుంది. ఆ సమరంలో దేవతల గెలుపు కోరి శ్రావణ పౌర్ణమి నాడు లక్ష్మీనారాయణులను, పార్వతీ పరమేశ్వరులను పూజించి.. శచీదేవి తన భర్త దేవేంద్రుడికి రక్ష కడుతుంది. దాని ప్రభావంతో దేవేంద్రుడు ఆ యుద్ధంలో గెలుస్తాడు. ద్వాపరయుగానికి చెందిన మరో కథ కూడా రక్షాబంధన్ గొప్పదనాన్ని తెలియజేస్తుంది. శ్రీకృష్ణుడికి ద్రౌపది సోదరి వరుస అవుతుంది. ఒకసారి కృష్ణపరమాత్మ సుదర్శన చక్రం ప్రయోగించినప్పుడు ఆయన వేలుకు గాయం అవుతుంది. అప్పుడు అక్కడే ఉన్న ద్రౌపది తన చీర చెంగును చింపి.. రక్తమోడుతున్న కృష్ణుడి వేలుకు కట్టు కడుతుంది. సోదరి ప్రేమకు చలించిపోతాడు కృష్ణుడు. ఈ రక్షే.. తర్వాత వస్త్రాపహరణ సమయంలో ద్రౌపదికి రక్షణగా నిలిచిందని చెబుతారు. రక్షాబంధన్‌కు సంబంధించిన చారిత్రక కథలు కోకొల్లలుగా వినిపిస్తాయి. అలెగ్జాండర్ భార్య రుక్సానా తన భర్త ప్రాణాలకు అభయం కోరుతూ.. పురుషోత్తముడికి రాఖీ కట్టిందని కథ. ఇవన్నీ ఎలా ఉన్నా.. రాఖీ పౌర్ణమి తోబుట్టువుల బాధ్యతలను గుర్తింపజేసే పండుగ. సోదరి బాగోగులు చూసుకోవడం సోదరుల కర్తవ్యం అని తెలియజేస్తుంది.

నేడు రాఖీ పౌర్ణమి



# తల్లి ఒడి

కథాసుధ

**ఓ** యువ అధ్యాపక దంపతులకు ఒక్కగానొక్క మగబిడ్డ కలిగాడు. ఆ పిల్లవాడిని తమకన్నా పెద్ద చదువులు చదివించాలనుకున్నారు. ఉన్నత స్థానంలో నిలబెట్టాలనుకున్నారు. పిల్లాడు పసివాడుగా ఉన్నప్పుడే అంతర్జాతీయస్థాయి విశ్వవిద్యాలయాల గురించి ఆరా తీయడం మొదలుపెట్టారు. అక్కడి ఉపాధ్యాయుల నేపథ్యం, కోర్సుల ప్రత్యేకతలు, అక్కడ చదివి గొప్ప స్థానాల్లో ఉన్న వారి వివరాలు తెలుసుకున్నారు. కొడుకు ఆ విశ్వవిద్యాలయాల్లో చదివే వయసుకు వచ్చేసరికి ఎంత డబ్బు కావాల్సి వస్తుందో లెక్కలేశారు. తమ దగ్గర ఉన్న వనరుల జాబితా చూసుకున్నారు. మరెంత కూడబెట్టాలో ఆలోచించసాగారు. మనవడిని చూడటానికి వచ్చిన అధ్యాపకుడి తల్లికి తన కొడుకు, కోడలి వింత ప్రవర్తన ఆశ్చర్యం కలిగించింది. 'ఎందుకు ఇంతలా ఇదైపోతున్నారు?' అని అడిగింది. విషయం చెప్పారు దంపతులు. ఆమె మనవడిని చేతిలోకి తీసుకుంటూ 'తల్లిని మించిన దైవం లేదని పెద్దలు ఎప్పుడో చెప్పారు. అలాగే తల్లి ఒడికి మించిన గొప్ప విశ్వవిద్యాలయం ఏదీ ఈ ప్రపంచంలో ఉండదు. ప్రేమ, అనురాగం, బుజ్జగింపు, ఆప్యాయత, మమకారం ఇవన్నీ ప్రధానం. అప్పుడే పై చదువుల గురించి ఆలోచిస్తూ మీరు ఒత్తిడికి గురికావద్దు. వాడిని ఒత్తిడికి గురిచేయవద్దు. ముందుగా బిడ్డకు స్వచ్ఛమైన బాల్యాన్ని ఇవ్వాలి. అది అమ్మతోనే సాధ్యం' అని సలహా ఇచ్చింది. 'నిజమే... తల్లి ఒడే ఓ పెద్ద విశ్వవిద్యాలయం. దైవం ప్రసాదించిన ఆలయం. ఇక్కడ నేర్చుకునేది మనిషి జీవితానికి తొలిమెట్టు అవుతుంది. అది లోపిస్తేనే సమస్యలు ఎదురవుతాయి' అని గుర్తించి బిడ్డను ముద్దులాడారు ఆ ఉపాధ్యాయ తల్లిదండ్రులు.

... ఆర్సీ కృష్ణస్వామి రాజు,
93936 62821



# జ్ఞానానందమయం దేవం

జ్ఞానానందమయం దేవం నిర్మల స్పటికాకృతిం।
ఆధారం సర్వవిద్యానాం హయగ్రీవముపాస్మహే॥

**'అనంతమైన,** ఆనందమయమైన జ్ఞానానికి అధిపతి, స్వచ్ఛమైన స్పటికం వంటి ఆకృతి కలిగి, సకల విద్యలకు అధిదేవత అయిన హయగ్రీవుడికి నమస్కరిస్తున్నాను' అని పై శ్లోకానికి అర్థం. హయగ్రీవ అవతారంలో శ్రీమహావిష్ణువు వేదాలను ఉద్ధరించాడు. అందువల్ల, వేదాలతోపాటు సమస్తమైన వాఙ్మయానికి, జ్ఞానానికి హయగ్రీవుడు అధిపతి అయ్యాడు. ఈ అవతారం దాల్చిన శ్రావణ పౌర్ణమిని హయగ్రీవ జయంతిగా జరుపుకొంటారు. ఈ స్వామి గుర్రం ముఖం, మానవ శరీరం కలిసిన రూపంలో దర్శనమిస్తాడు. స్వామి వామాంకం మీద లక్ష్మీదేవి ఆసీనురాలై ఉంటుంది. స్వామిది తెల్లటి శరీర ఛాయ. నాలుగు చేతుల్లో శంఖం, చక్రం, చిన్ముద్ర, పుస్తకాలను ధరించి భక్తులను అనుగ్రహిస్తూ ఉంటాడు. శ్రావణ పూర్ణిమ రోజున హయగ్రీవుడు అవతరించాడని పురాణాలు చెబుతున్నాయి. పురాణాల్లో హయగ్రీవ అవతారానికి సంబంధించి అనేక కథలు ఉన్నాయి. మధుకైటభులనే రాక్షసులు వేదాలను అపహరించి, పాతాళంలో దాచిపెడతారు. వేదాలు లేనిదే సృష్టి కార్యం చేయలేనని బ్రహ్మదేవుడు విష్ణుమూర్తికి విన్నవించుకుంటాడు. వెంటనే, శ్రీమహావిష్ణువు హయగ్రీవ అవతారంలో పాతాళానికి చేరి, మధుకైటభులను వధించి, వేదాలను రక్షించి, బ్రహ్మదేవుడికి తిరిగి అప్పగిస్తాడు. హయగ్రీవుడు పరిపూర్ణ వేదమూర్తి. స్వామి రూపం సకల విద్యలకు నిలయం. అంతేకాదు, ఆయన సకల దేవతా స్వరూపం కూడా. ఆయనవల్లనే ఈ లోకానికి లలితా సహస్రనామం, దుర్గా త్రిశతి మొదలైన విద్యలు అందాయి. ఎంతోమంది రుషులు హయగ్రీవస్వామిని అర్చించి ఆత్మజ్ఞానాన్ని సంపాదించారు. దాన్ని సమాజ పునరుద్ధరణ కోసం వినియోగించారు.

నేడు హయగ్రీవ జయంతి

